మోతీలాల్ నెహ్రూనగర్‌లో ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ వేడుకల్లో పాల్గొన్న గౌరవ్ శ్రీనివాస్

సనత్‌నగర్: నియోజకవర్గంలోని బేగంపేట మోతీలాల్ నెహ్రూనగర్‌లో శనివారం సాయంత్రం ఇఫ్తార్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా కులమతాలకతీతంగా ఏర్పాటు చేసిన ఈ విందులో కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కాలనీ అధ్యక్షుడు గౌరవ్ శ్రీనివాస్, ప్రతినిధులు నీరవ్ షా, నంగునూరి చంద్రశేఖర్, మహ్మద్ వికారుద్దీన్, కలీం మనియర్‌తో పాటు కాలనీ సభ్యులు కుటుంబ సమేతంగా హాజరయ్యారు.



పూడిక తీశారు.. తరలించడం మరిచారు!

తార్నాక డివిజన్ లాలాపేటలోని ఓపెన్ నాలా నుంచి తీసిన పూడికను నాలా పక్కనే రోడ్డుపై గుట్టలుగా పోసి వదిలేసారు. తీసిన వ్యర్థాలను తరలించకపోవడంతో మళ్లీ నాలాలోకి జారిపోతోంది. రోజుల తరబడి రోడ్డుపై గుట్టలుగా పేరిపోవడంతో ఆ మార్గంలో రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు.ఈ వ్యర్థాల కారణంగా అప్పుడప్పుడు ప్రమాదాలు సైతం చోటు చేసుకుంటున్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరో వైపు రోడ్లపై చెత్త లేకుండా చేయాలనే సంకల్పంతో మహిళా సంఘాలతో కలిసి జీహెచ్ఎంసీ ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతుంది. కానీ నాలా పక్కన రోజుల తరబడి ఉన్న వ్యర్థాలను మాత్రం తరలించే వారు లేరా అన్ని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. – లాలాపేట

రైల్వేలో 71 మంది పదవీ విరమణ



అనీల్‌కు వీడ్కోలు పలుకుతున్న షేక్ రవూఫ్

అడ్డగుట్ట: దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్‌లో వివిధ హోదాల్లో విధులు నిర్వహిస్తున్న 71 మంది ఉద్యోగులు శనివారం పదవీ విరమణ పొందారు. హెడ్‌క్వార్టర్స్, సికింద్రాబాద్, హైదరాబాద్ డివిజన్లతో పాటు లాలాగూడ వర్క్‌షాపులో వీరు పని చేశారు. పదవీ విరమణ చేసిన అధికారులు, ఉద్యోగులకు ఈ సందర్భంగా ఆత్మీయ వీడ్కోలు పలికారు. వివిధ కార్మిక సంఘ నాయకులు షేక్ రవూఫ్, ఏజీకే. మూర్తి, చింతకుంట రామకృష్ణ అకౌంట్స్ విభాగంలో పదవీ విరమణ చేసిన వారిని శాలువాతో సత్కరించి జ్ఞాపికలను బహూకరించారు.



ప్రొ.వర్ధినిని సన్మానిస్తున్న అధ్యాపకులు

ప్రొ.వర్ధినికి వీడ్కోలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ సైన్స్ కాలేజీ ఫిజిక్స్ డిపార్టుమెంట్ ప్రొ.వర్ధిని ఉద్యోగ విరమణ సందర్భంగా అధ్యాపకులు, ఉద్యోగులు, విద్యార్థులు ఘనంగా వీడ్కోలు పలికారు. శనివారం ఫిజిక్స్ విభాగం ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ప్రిన్సిపల్ ప్రొ.వీరయ్య అధ్యక్షత వహించగా సీనియర్ ప్రొ.అప్పారావు, సైన్స్ డీన్ ప్రొ.కరుణసాగర్, చీఫ్ వార్డెన్ డాక్టర్ కొర్రెముల శ్రీనివాస్ రావు తదితరులు ప్రొ.వర్ధినిని సన్మానించి ఆమె సేవలను కొనియాడారు.

ఇంటర్ గేమ్స్ మీట్‌లో ప్రతిభ

గాంధీఆస్పత్రి: కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ (కేఎన్ఆర్‌యూహెచ్ఎస్) ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్ గేమ్స్ మీట్‌లో సికింద్రాబాద్ గాంధీ మెడికల్ కాలేజీ ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచింది. గాంధీ మెడికల్ కాలేజీ విద్యార్థినులు ప్రతిభ ప్రదర్శించి లాన్ టెన్నిస్, బాస్కెట్‌బాల్‌లో విన్నర్స్, బాడ్మింటన్, టేబుల్ టెన్నిస్‌లో రన్నర్స్‌గా నిలిచి, ఓవరాల్ ఛాంపియన్ ట్రోఫీని సొంతం చేసుకున్నారు. వరంగల్ కాకతీయ మెడికల్ కాలేజీ మైదానంలో ఈ నెల 24 నుంచి 29 వరకు జరిగిన పోటీల్లో 78 మెడికల్, డెంటల్, ఫిజియో, హోమియో, ఆయుష్, యునానీ మెడికల్ కాలేజీలకు చెందిన 700 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. గాంధీ మెడికల్ కాలేజీలో శనివారం జరిగిన అభినందన కార్యక్రమంలో



సాధించిన ట్రోఫీతో గాంధీ విద్యార్థినులు

ఆయా క్రీడల్లో రాణించిన విద్యార్థినులు చరిత, అపూర్వరెడ్డి, శ్రావ్య, స్వేచ్ఛరెడ్డి, జాహ్నవి, శృతి, సంతోషి, వైష్ణవి, రిషిక, హరిణిశ్రీ, సంజ్యోత, సంజన, దీప్తి, చిన్మయిను గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ రమేష్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణమోహన్, ఫిజికల్ డైరెక్టర్ (పీడీ)వేణు అభినందించారు.

వేసవిలో పక్షులకు నీళ్లు పెట్టండి



నీటి తొట్టిలను ఏర్పాటు చేస్తున్న విద్యార్థులు

ఉస్మానియా యూనివర్సిటీ: వేసవిలో పక్షులకు జంతువులకు నీళ్లు పెట్టాలని స్టూడెంట్ ఫర్ డెవలప్‌మెంట్ (ఎస్ఎఫ్‌డీ) జాతీయ కన్వీనర్ మయూర్ జవేరి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీటి కొరత తీవ్రంగా ఉండే వేసవిలో పక్షులు ఇతర జంతువుల కోసం పాత్రలు, ఇతర కుండీలను ఏర్పాటు చేసి నీటిని నింపాలన్నారు. జీవరాశులను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కో–కన్వీనర్ ధరవత్ కోటేశ్వర్, రామకృష్ణ, స్వామి, చంద్రశేఖర్, ప్రదీప్, గోపాల్, సుమన్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నివారణకు సమన్వయంతో పనిచేయాలి

డీసీపీ సుబ్బరాయుడు



అధికారులకు సూచనలు చేస్తున్న డీసీపీ సుబ్బరాయుడు

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ నివారణకు ఆయా శాఖల అధికారులు కలిసి సమన్వయంతో పనిచేయాలని ట్రాఫిక్ డీసీపీ సుబ్బరాయుడు సూచించారు. శనివారం ట్రాఫిక్ అదనపు డీసీపీ రంగారావు, ఏసీపీ శంకర్‌రాజు, ఇన్‌స్పెక్టర్లు వెంకటరాములు, ఉప శంకర్, ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ విజయ్‌కుమార్, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ సరస్వత్‌తో కలిసి ఆయన సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో పర్యటించి ట్రాఫిక్ నియంత్రణపై పలు సూచనలు సలహాలు అందించారు. ఉదయం, సాయంత్రం వేళల్లో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుందని దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రైల్వే స్టేషన్ ఔట్ గేటు వద్ద ఆర్టీసీ బస్సులు ముందుకు వచ్చి మలుపు తీసుకోకుండా చూడాలని, ఎక్కువ సమయం వేచి చూడటంతో వెనుక వైపు బస్సులు బారులు తీరి ట్రాఫిక్‌కు ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ఆర్టీసీ, సెట్విన్ డ్రైవర్లకు కూడా అవసరమైతే శిక్షణ ఇవ్వాలన్నారు. ఆల్ఫా హోటల్ ఎదురుగా రెండు వైపులా నుంచి ఆటోలు వస్తుండటంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుండటంతో ఒక వైపు మాత్రమే అనుమతించాలని ట్రాఫిక్ పోలీసులను ఆదేశించారు. అలాగే అక్కడ ఉన్న ద్విచక్ర వాహనాల పార్కింగ్, రోడ్డును ఆక్రమించి ఏర్పాటు చేసిన ఆక్రమణలను తొలగించాలని ఆదేశించారు. ఫుట్‌పాత్ వ్యాపారులు కూడా ఫుట్‌ఫాత్, రోడ్డును ఆక్రమించకుండా తమకు కేటాయించిన స్థలాల్లో మాత్రమే వ్యాపారాలు నిర్వహించుకునేలా చూడాలని చెప్పారు.

పార్శిగుట్ట రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలి

ముషీరాబాద్: ముషీరాబాద్ డివిజన్‌లోని రాంనగర్ నుంచి పార్శిగుట్ట రోడ్డుకు వెళ్లే మార్గంలో రోడ్డును తవ్వి అలాగే వదలడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేయాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ జీహెచ్ఎంసీ అధికారులను డిమాండ్ చేశారు. శనివారం ముషీరాబాద్ డివిజన్ బీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు నర్సింగ్‌ప్రసాద్ ఆధ్వర్యంలో స్థానికులు ఎమ్మెల్యే గోపాల్‌ను కలిసి పార్శిగుట్ట రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలని, డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులు సమన్వయంతో వ్యవహరిస్తూ రోడ్డు నిర్మాణ పనులు, డ్రైనేజీ సమస్యను వెంటనే పరిష్కరించాలన్నారు. అధికారులు కాలయాపన చేయకుండా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి త్వరితగతిన అభివృద్ధి పనులను పూర్తి చేయాలన్నారు. స్థానిక నాయకులు రవీందర్, చంద్రశేఖర్, మోహన్‌రావు, నర్సింహ, డేవిడ్, రంగప్ప, రవి తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.17, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 40, పచ్చిమిర్చి 55, బజ్జీమిర్చి 45, క్యాప్సికమ్ 70, పచ్చకాకర 35, పందిరి బీర 38, క్యాబేజీ 19, క్యారెట్ 23, దొండ 23, గుండుబీన్స్ 60, గింజ చిక్కుడు 60, గోకరకాయ 35, కీర 23, దోసకాయ 18, బీట్‌రూట్ 23, ఉల్లిగడ్డ 22, ఆలుగడ్డ 28, చామగడ్డ 40, మొరంగడ్డ 19 కందగడ్డ 65, సొరకాయ 9, పొట్లకాయ 15, అరటికాయ 9, మునగకాయ 3–4, ముల్లంగి 4–5. ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

జోరందుకుంటున్న హలీం విక్రయాలు



చిలకలగూడ: రంజాన్ మాసంలో మాత్రమే లభించే హలీం విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. చిలకలగూడ, అమర్‌టాకీస్, మైలార్‌గడ్డ, వారాసిగూడ తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన విక్రయ కేంద్రాల వద్ద బారులుతీరి హలీమ్ రుచులను ఆస్వాదిస్తున్నారు. మటన్ హలీంకే ఎక్కువగా డిమాండ్ ఉందని విక్రేతలు తెలిపారు. గత మూడున్నర దశాబ్దాలుగా హలీం విక్రయాలు నిర్వహిస్తున్నట్లు మైలార్‌గడ్డ ఎవర్‌గ్రీన్ హోటల్ నిర్వాహకుడు సర్దార్‌భాయ్ తెలిపాడు. పార్శిల్ ద్వారా హలీమ్ అమ్మకాలు ఎక్కువగా జరుగుతున్నట్లు వివరించాడు.

సీఎం రేవంత్‌ను కలిసిన నాయకులు



కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిశారు. ఇటీవల సికింద్రాబాద్ బార్ అసోసియేషన్ నుంచి ఉపాధ్యక్షుడిగా విజయం సాధించిన వెంకటరమణను సీనియర్ నాయకులు అయూబ్‌ఖాన్, దేవేందర్, సంజీవరెడ్డి ముఖ్యమంత్రికి పరిచయం చేశారు. అనంతరం రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు అత్యధిక మెజార్టీతో విజయం సాధించేలా కృషి చేయాలని వారికి సూచించారు.

లైసెన్స్ తుపాకుల స్వాధీనం

లాలాపేట: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఉస్మానియా యూనివర్సిటీ పోలీసు స్టేషన్ పరిధిలో లైసెన్స్ కలిగిన 36 మంది నుంచి తుపాకులను స్వాధీనం చేసుకున్నట్లు ఓయూ పీఎస్ ఇన్‌స్పెక్టర్ రాజేందర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓయూ పీఎస్ పరిధిలో మొత్తం 40 వరకు లైసెన్స్ గన్స్ ఉన్నాయని, ఇందులో నలుగురి వద్ద రెండేసి గన్స్ ఉన్నట్లు పేర్కొన్నారు. వారంతా తమ తుపాకులను పీఎస్‌లో డిపాజిట్ చేశారన్నారు. దీంతో పాటు మాజీ రౌడీషీటర్లను సైతం బైండోవర్ చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా పోలీసు భద్రతా పరంగా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు.

నేడు ఐనోస్ చర్చిలో ఈస్టర్ వేడుకలు

లాలాపేట: తార్నాకలోని ఐనోస్ చర్చిలో ఆదివారం ఉదయం 5 గంటల నుంచి 10 గంటల వరకు ఈస్టర్ వేడుకలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఐనోస్ చర్చి అండ్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు రెవరెండ్ ఆర్ విలియం కేరి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సర్వ మానవ పాప విమోచన కోసం కల్వరి శిలువలో మరణించి మూడవ రోజు తిరిగి పునరుత్థానమైన సందర్భాన్ని పురస్కరించుకుని ఈస్టర్ వేడుకలను నిర్వహిస్తారన్నారు.

ఉత్సాహంగా వార్షికోత్సవం



చిన్నారుల డ్యాన్స్

లాలాపేట: తార్నాకలోని ఇంటెల్లీ టోట్స్ ప్రీ స్కూల్ వార్షికోత్సవం తార్నాక వెల్ఫేర్ అసోసియేషన్ కమ్యూనిటీ హాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సరీ విద్యార్థులు గ్లామర్ వాక్, డ్యాన్స్, సూపర్ హీరో ఫ్యాన్సీ డ్రెస్‌లో ఆడుతూ పాడుతూ సందడి చేశారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ ప్రకృతి శర్మ, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు, తల్లిదండ్రులు

బాక్సింగ్‌లో సత్తా

అడ్డగుట్ట: ఐవీరావు బాక్సింగ్ అకాడమీ ఆధ్వర్యంలో తెలంగాణ బాక్సింగ్ ఫెడరేషన్ సహకారంతో ఉత్తరప్రదేశ్‌లోని నోయాడాలో మార్చి 18 నుంచి 25 వరకు జరిగిన థర్డ్ సబ్ జూనియర్ చాంపియన్ షిప్‌లో తెలంగాణ బాల బాలికలు సత్తా చాటారు. శనివారం లాలాగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో తెలంగాణ బాక్సింగ్ అకాడమీ వైస్ ప్రసిడెంట్ మన్మోహన్, సెక్రటరి రవీందర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ లక్ష్మణ్ మాట్లాడుతూ.. 40–45 కేజీల బాలుర విభాగంలో రమేష్, స్వప్నీల్ సిల్వర్ మెడల్, 37–40 కేజీల బాలుర విభాగంలో యశ్వంత్ బ్రోన్స్ మెడల్ సాధించారని తెలిపారు. 67 కిలోల బాలికల విభాగంలో అయుష్మిత బెనర్జీ బ్రౌన్స్ మెడల్, 64–67 కేజీల బాలికల విభాగంలో తనుశ్రీ బ్రౌన్స్ మెడల్ సాధించారన్నారు.



మాట్లాడుతున్న మన్మోహన్

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహించిన డాక్టర్ రాకేష్

ముషీరాబాద్: ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని భోలక్‌పూర్‌లోని బైబిల్ హౌస్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ బి.రాకేష్ అన్నారు. శనివారం సిద్ధికనగర్‌లో సొసైటీ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ రెయిన్‌బో హోం, ఆస్టర్ ప్రైమ్ హాస్పిటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 250 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. దంత, కంటి పరీక్షలు, బీపీ, షుగర్ తదితర పరీక్షలు నిర్వహించారు. రెయిన్‌బో హోం సీనియర్ మేనేజర్ శ్రీలత, కో ఆర్డినేటర్ క్రాంతి కిరణ్, ఎస్ఆర్‌డీ సంస్థ ప్రతినిధులు కిషోర్, ఇందిరాభారతి, శివరాణి తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయాలి



మాట్లాడుతున్న సంఘం అధ్యక్షుడు రాజేశ్వర్‌యాదవ్

హిమాయత్‌నగర్: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు రాజేశ్వర్‌యాదవ్ డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో విద్యార్థులకు ఇంజనీరింగ్ కాలేజీలు సర్టిఫికెట్లు ఇవ్వకుండా వేధిస్తున్నాయన్నారు. శనివారం జాతీయ బీసీ సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బీసీ గ్రాడ్యుయేట్లు, డిగ్రీ విద్యార్థులకు, బ్యాంకింగ్ కోసం ఉచిత కోచింగ్ అందించి, బీసీ స్టడీ సర్కిల్ బడ్జెట్ రూ. 15,000 కోట్లకు పెంచాలని కోరారు. పెరిగిన ధరలకు అనుగుణంగా ఇంటర్, డిగ్రీ, ఇంజినీరింగ్, పీజీ కోర్సుల స్కాలర్‌షిప్‌లను రూ. 5000 నుంచి 25,000 వరకు పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. నేతలు భిక్షపతి యాదవ్, బాలరాజ్ గౌడ్, మల్లేష్, వెంకటాద్రి, జగదీష్ చారి, వర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఆరు గ్యారంటీలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రీనిష్ రెడ్డి

రసూల్‌పురా: సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చర్యలు చేపడుతామని మల్కాజ్‌గిరి పార్లమెంట్ అభ్యర్థి సునీతా మహేందర్ రెడ్డి కుమారుడు రీనిష్ పేర్కొన్నారు. శనివారం తిరుమలగిరిలో కంటోన్మెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వెన్నెల ఆధ్వర్యంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో రీనిష్ పాల్గొని ఆరు గ్యారంటీల హామీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీగణేష్, మర్రి అమరేందర్ రెడ్డి, నరసింహ కన్నన్, బాబురావు, సమీర్, మారుతి గౌడ్, నాసర్, బొల్లు కిషన్ పాల్గొన్నారు.

టెట్ పరీక్ష ఫీజు తగ్గించాలి



ఆందోళన చేస్తున్న విద్యార్థులు

ఉస్మానియా యూనివర్సిటీ: టెట్ అర్హత పరీక్ష ఫీజు తగ్గించాలని శనివారం ఓయూలో విద్యార్థులు ఆందోళన చేపట్టారు. బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో యూనివర్సిటీ లైబ్రరీ ఎదుట నిరసన తెలిపారు. నిరుద్యోగులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటుంటే టెట్ ఫీజును రూ.2000 వేలకు పెంచి అభ్యర్థుల జీవితాలతో చలగాటమాడుతున్నారని పేర్కొన్నారు. టెట్ ఫీజు తగ్గించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి జంగయ్య, నాగరాజుయాదవ్, మిథున్, నాగేందర్, శ్రావ్య, విజయ్, బాలు, కృష్ణ, సాయి పాల్గొన్నారు.

'పీవీ'కి భారతరత్నపై సంబరాలు



పీవీ విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న దృశ్యం

సనత్‌నగర్: మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావుకు ప్రకటించిన భారత రత్న పురస్కారాన్ని ఆయన కుటుంబ సభ్యులకు ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో అందజేసిన నేపథ్యంలో బేగంపేట బ్రాహ్మణవాడీలోని స్వామి రామానందతీర్థ కమిటీలో సంబురాలు చేశారు. కమిటీ ప్రాంగణంలోని పీవీ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. ఇక్కడి స్వామి రామానందతీర్థ మెమోరియల్ మోడల్ స్కూల్ చిన్నారులకు మిఠాయిలు పంచిపెట్టారు.

హుండీల ఆదాయం లెక్కింపు



అమీర్‌పేట: బల్కంపేట ఎల్లమ్మ దేవాలయం హుండీలను శనివారం లెక్కించారు. 40 రోజుల హుండీలతో పాటు అన్నదానం రూపంలో రూ.40,01,324, ఈ–హుండీ ద్వారా మరో రూ.3,45,501 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహణ అధికారి కుంట నాగరాజు తెలిపారు. 56 అమెరికా డాలర్స్, 07 కెనడా డాలర్స్, యూకే ఫౌండ్స్ 20, ఆస్ట్రేలియన్ డాలర్స్ 5, మలేషియా 1, ఖతార్ 5 వచ్చాయన్నారు. లెక్కింపులో ఆలయ చైర్మన్ సాయిబాబాగౌడ్, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన 'పది' పరీక్షలు



పరీక్షలు ముగియడంతో సంతోషం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

ముషీరాబాద్: పదవ తరగతి పరీక్షలు శనివారం ప్రశాంతంగా ముగిశాయి. ఈ నెల 19 నుంచి ప్రారంభమైన పరీక్షలు ముషీరాబాద్ విద్యామండలి పరిధిలో 4878 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. పరీక్షలకు చివరి రోజు కావడంతో పరీక్షా హాల్ నుంచి బయటకు వచ్చిన విద్యార్థులు తోటి స్నేహితులను కలిసి విషెష్ చెప్పుకున్నారు. పరీక్షా కేంద్రాలలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నామని ముషీరాబాద్ విద్యామండలి డిప్యూటీ ఈవో చిరంజీవి తెలిపారు.



గుర్తుండిపోయేలా సెల్ఫీ

పదవ తరగతి పరీక్షలు ముగియడంతో విద్యార్థులు సంతోషంగా పరుగులు తీశారు. ఈ నెల 18న ప్రారంభమైన పరీక్షలు శనివారం ముగియగా ఏప్రిల్ 2వ తేదీ వరకు అరబిక్, సంస్కృతంతో పాటు ఒకేషనల్ కోర్సుకు సంబంధించిన పరీక్షలు జరుగనున్నాయి. శనివారం ప్రధాన సబ్జెక్టుల పరీక్షలు ముగియడంతో బయటకు వచ్చిన విద్యార్థులు ఒకరికొకరు వీడ్కోలు పలుకుతూ, సెల్ఫీలు దిగుతూ సరదాగా గడిపి ఇళ్లకు వెళ్లిపోయారు.



–రాంగోపాల్‌పేట్